క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 5 నుంచి రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు గోగుల సతీష్ మెమోరియల్ ట్రస్టు సభ్యుడు రాయి వీరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ, నాలుగవ, ఐదవ బహుమతుల కింద వరుసగా రూ.5,016, రూ.3,016, రూ.2,016, రూ.1,016, రూ.816ల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్.99496 24066 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

5న క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త చర్చి కమిటీ హాల్‌లో స్థానిక శుభోదయ యువజన సంఘం, చర్చి కమిటీ పెద్దల సహకారంతో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో గర్భసంచి, రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.25 వేల విరాళం


నగదు అందజేస్తున్న నర్సింహారావు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి శుక్రవారం మండల కేంద్రానికి చెందిన చింతల పాటి నర్సింహారావు, ప్రమీల దంపతులు రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, బి.మహేష్, బి.ఉపేందర్, ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ బిందు

మునగాల : మండలంలోని మాధవరంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆ గ్రామానికి చెందిన నంద్యాల కోటిరెడ్డి (వికారాబాద్ ఎస్పీ) సహకారంతో యూనిఫామ్‌ను ఎంపీపీ ఎలక బిందు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు- మనబడి పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ నంద్యాల విజయలక్ష్మి, ఆరె.జానకమ్మ, హెచ్‌ఎం నవీన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ సరిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం


జిల్లా ఉత్తమ అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ జ్యోతి, తదితరులు

నడిగూడెం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అధికారులుగా తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య పురస్కారాలు అందుకున్నారు. కాగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల కవిత, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు జలీల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో అగ్గితెగులు వ్యాప్తిని అరికట్టాలి


గుండెబోయినగూడెంలో వరిపొలం పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

పాలకవీడు : వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అగ్గి తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ అధికారి బి.రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుండెబోయినగూడెంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్గి తెగులు వ్యాప్తిని అరికట్టకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే యూరియా వాడకాన్ని నిలిపివేయాలని, అవసరాన్ని బట్టి చల్లుకోవాలని సూచించారు. అలాగే ట్రైసైక్లోజోల్, మ్యాన్‌కోజెబ్, ఐసోప్రొథయోలిన్, టెబుకొనజోల్, కాసుగామైసిన్ రసాయనాలను తగు మోతాదులో పదిహేను రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట ఏఈఓలు శారద, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

చిన్నగట్టు జాతరకు అంతా సిద్ధం

- పెద్దగట్టు జాతర తరహాలో నిర్వహణకు ఏర్పాట్లు
- 5న ప్రభల ఊరేగింపు
- భారీగా హాజరుకానున్న భక్తులు


ముస్తాబైన లింగమంతుల స్వామి ఆలయం


గంగమ్మ, బొడ్డెమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం శివారులో చిన్న గట్టు (యాదవగట్టు) జాతరకు అంతా సిద్ధం చేశారు. యాదవుల ఆరాధ్య దైవమైన ఈ జాతరను పెద్దగట్టు జాతర మాదిరిగానే రెండు ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు ఈ జాతరను గ్రామంలోని యాదవ కులస్తులతో పాటు స్థానిక ప్రజలందరూ కలిసి కట్టుగా ఘనంగా నిర్వహించుకుంటారు.

6న అభిషేకాలు, జాతర..

కాగా, ఈనెల 5వ తేదీన సాయంత్రం ప్రభలు, గంపల ఊరేగింపు, 6న స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, జాతర మహోత్సవం నిర్వహించనున్నారు. 7న చంద్రపట్నం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. కాగా ఇప్పటికే ఆలయ నిర్వాహకులు గుడికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించి ముస్తాబు చేశారు.

ఏపీ నుంచి సైతం భక్తులు..

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు గట్టు చుట్టూ వాటర్ ట్యాంకులతో మంచినీటి సౌకర్యం కల్పించారు. విద్యుత్ సదుపాయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా జాతరకు భక్తులు భారీగా తరలిరానున్నారు. సూర్యాపేట జిల్లాతో పాటు ఖమ్మం, నల్లగొండ, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా పెద్దగట్టు జాతరకు హాజరుకాలేని వారు కూడా ఇక్కడికే వస్తారని తెలిపారు. పలు పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరవుతున్నారని చెప్పారు. జాతర సందర్భంగా గ్రామంలో యువకులు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



మా గ్రామంలో యాదవ (చిన్న) గట్టుపై ఉన్న లింగమంతులస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారికి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. ఇక్కడ ముత్యాలమ్మ ఆలయం నిర్మించేందుకు దాతలు ముందుకు రావాలి.

– గుండెబోయిన చిన్నలింగయ్య, ఆలయ కమిటీ చైర్మన్

లోక్ అదాలత్ సభ్యుల నియామకం


కొట్టు సురేష్


కమతం నాగార్జున

హుజూర్‌నగర్ : పట్టణంలో ఈనెల 11న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా జూనియర్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు లోక్ అదాలత్ సభ్యులను నియమిస్తూ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచీకి జూనియర్ సివిల్ జడ్జి సంకేత్ మిత్ర ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, న్యాయవాదులు కొట్టు సురేష్, కమతం నాగార్జున లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. అలాగే సీనియర్ సివిల్ జడ్జి కోర్టు బెంచీకి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, న్యాయవాదులు దొంతిరెడ్డి నారాయణరెడ్డి, చనగాని మహేష్ లోక్ అదాలత్ సభ్యులుగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవోపేతం.. స్వామివారి కల్యాణం


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసి ఆకులతో అలంకరించి పూజలు నిర్వహించి, వేదమంత్రోత్సవాల మధ్య కల్యాణ ఘట్టం పూర్తిచేశారు. అనంతరం స్వామివారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, సర్పంచ్ సీతారాంరెడ్డి, ఎంపీటీసీ స్వప్న, ఉప సర్పంచ్ షేక్. సైదాబీ, పూజారులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, బదరి శ్రీనివాసాచార్యులు, సుదర్శనం రాజన్‌చార్యులు భక్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనతో విసుగు చెందిన ప్రజలు


మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ పాలక్ మల్లేశం

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ పాలనతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారని బీజేపీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పాలక్ దాసరి మల్లేశం అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నిరుద్యోగ భృతి, లక్షలోపు రుణమాఫీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని దీమా వ్యక్తం చేశారు. అనంతరం అంజలీపురం నుంచి బీజేపీలో చేరిన పలువురికి కాషాయ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, నాయకులు ఎం.చంద్రారెడ్డి, గంధం సతీష్, మాడుగుల లక్ష్మీనారాయణ, గంగసాని నారపరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి


డంపింగ్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

నేరేడుచర్ల : పాత నేరేడుచర్లలోని డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పాత నేరేడుచర్ల, కమలానగర్ వాసులు శుక్రవారం డంపింగ్ యార్డు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 1, 8వ వార్డు కౌన్సిలర్లు కొణతం చిన వెంకట్‌రెడ్డి, కొదమగుండ్ల సరితలు మాట్లాడుతూ కాలనీలకు సమీపంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడంతో దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విష జ్వారాల భారీన పడుతున్నామన్నారు. గతంలో ఆందోళన చేసినప్పుడు డంపింగ్ యార్డుకు ప్రహరీ ఏర్పాటు చేయడంతో పాటు తడి, పొడి చెత్త వేరు చేసి దుర్వాసన రాకుండా చేస్తామని స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డి హామీ ఇచ్చి నేటికీ నేరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో పాత నేరేడుచర్ల, కమలానగర్ ప్రజలు పొరెడ్డి లింగారెడ్డి, కాసాని సైదులు, లీలామనోజ్‌రెడ్డి, సైదులు, బుచ్చయ్య, వెంకన్న, సైదిరెడ్డి తదితరులున్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మేళ్లచెరువు : మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి సారెడ్డి పాపిరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారన్నారు. కొంతమంది ఎరువుల షాపు నిర్వాహకులు నాసిరకం యూరియాను అధిక ధరలకు అంటగడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. అధికారులు రైతులకు సరిపడ యూరియా అందుబాటులో ఉంచాలని కోరారు.

రైతు సంఘం డైరీ ఆవిష్కరణ


రైతు సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలుకూరు : రైతులకు తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు 24 గంటలు కరెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, కంబాల శ్రీను, బొల్లు ప్రసాద్, వాసిరెడ్డి సోమిరెడ్డి, వీరబాబు, కోటయ్య పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

నడిగూడెం : వరి సాగులో ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని కోదాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.వాసు సూచించారు. శుక్రవారం మండలంలోని కరివిరాలలో వరి పంట సాగులో చీడ పీడలు, ఎరువుల యాజమాన్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యూరియాను తగిన మోతాదులో వేయాలన్నారు. ఎరువులు వేయడం, పురుగు మందుల పిచికారీపై సందేహాలుంటే వ్యవసాయాధికారి, విస్తరణాధికారిలను సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, ఏఈఓ రేష్మా, రైతులు పాల్గొన్నారు.

సహస్ర కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ఆరాధన, లక్ష్మి అమ్మవారికి అభిషేకం, గోదాదేవి అమ్మవారికి అలంకరణ, సహస్ర కుంకుమార్చన, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదపారాయణం


ఆలయంలో వేదపారాయణం చేస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రాతఃకాలంలో శ్రీవిష్ణు, లక్ష్మి, రామానుజ అష్టోత్తరాలు, వేదపారాయణంతో పూజలు చేసి తిరుప్పావై పఠించారు. ఆళ్వారుస్వాములను పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ ఈఓ, అర్చకులు, స్థానాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం ఏర్పాట్ల పరిశీలన..

కాగా, 5వ తేదీన జరిగే కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, దొంతిరెడ్డి పద్మ, కౌన్సిలర్లు ఫణికుమారి రాంరెడ్డి, శంభయ్య, తదితరులు పరిశీలించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ఐటీ సెల్ కన్వీనర్ శ్రీనివాసరావు

మునగాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ వంగవేటి శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10 నుంచి 25 వరకు మండలాల్లో కార్నర్ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, రెణబోతు శ్రీనివాసరెడ్డి, వేముల వీరబాబు, మైలార్‌శెట్టి నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, రమేష్, గోపి పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

మఠంపల్లి : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వైద్యశాలల్లో పేదల ఆరోగ్యం కోసం రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు భరించేందుకు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా గిరిజన మోర్చా నాయకుడు బానోతు రంగానాయక్ అన్నారు. శుక్రవారం తుమ్మలతండా, బీల్యానాయక్‌తండా తదితర తండాల్లో ఆయుష్మాన్ భారత్ పథకంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. నాయకులు శివాజీనాయక్, నాగరాజునాయక్, నానునాయక్ తదితరులున్నారు.

జాతరలకు నిలయం.. తెలంగాణ రాష్ట్రం

- మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు


ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు


ఎద్దుల పందేల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ కవిత

కోదాడఅర్బన్ : జాతరలకు తెలంగాణ రాష్ట్రం నిలయమని, జాతరలతో ప్రజల్లో ఐక్యమత్యం పెరుగుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని అనంతగిరి రోడ్డులో గల పెద్దచెరువు కట్టపై ఉన్న బోడిగుట్టపై లింగమంతులస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు నాలుగు పండ్ల స్థాయిలో ఒంగోలు జాతి ఎద్దుల (రెండు రాష్ట్రాల స్థాయి) పందేలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతరలు, పండుగలు మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలని, వాటిని కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, లింగమంతుల స్వామి ఆలయ కమిటీ సభ్యుడు ఈదుల కృష్ణయ్య యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కోదాడ పట్టణంలో లింగమంతులస్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి గిత్తల బండలాగుడు ప్రదర్శనలో భాగంగా నాలుగు పళ్ల విభాగంలో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ కవితారాధారెడ్డి.. మున్సిపల్ మహిళా కౌన్సిలర్లతో కలిసి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం ప్రకాశం జిల్లా పుచ్చకాయల శేషాద్రి బుల్స్‌కు రూ.30 వేలను దాత సుంకరి శివరాంయాదవ్ సమక్షంలో అందజేశారు. ద్వితీయ స్థానం గుంటూరు జిల్లా సరిపూడికి చెందిన వీదురపల్లి శ్రీనివాసరావు ఎడ్లకు దాత న్యాయవాది చల్లా కొండల్‌రెడ్డి రూ.30 వేలను అందజేశారు. మూడవ స్థానంలో ప్రకాశం జిల్లా గంగన్నపాలెంకు చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి బుల్స్ నిలవగా దాత బెలిదే శరభయ్య, సువర్ణలక్ష్మి జ్ఞాపకార్థం బెలిదే అశోక్ ఇచ్చిన రూ.15లను అందజేశారు. హుజూర్‌నగర్‌కు చెందిన మామిడి పద్మావతి బుచ్చయ్య, మామిడి రామారావులు అందించిన రూ.12వేలను నాలుగవ స్థానంలో నిలిచిన జక్కుల వెంకటేశ్వర్లుయాదవ్‌కు అందజేశారు. గుంటూరు జిల్లా కొండపారిపాలెంకు చెందిన జీపీ చౌదరి బుల్స్ ఐదవ స్థానంలో నిలవగా రూ.10వేలను దాతలు ఆళ్లకుంట నర్సింహారావు, సుజాతలు అందజేశారు. ఆరవ స్థానంలో నిలిచిన రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కొప్పుల సమీర్‌రెడ్డి గిత్తలకు దాత పుట్టపాక సురేష్ రూ. 8వేలు అందజేశారు. నరసరావుపేటకు చెందిన శ్రీకాంత్ యాదవ్ బుల్స్ ఏడవ స్థానంలో నిలువగా రూ.6వేలను దాత గోపిదేవి వీరస్వామి అందజేశారు. జక్కుల వెంకటేశ్వర్లుయాదవ్ గిత్తలు ఎనిమిదవ స్థానంలో నిలవగా రూ.5వేలను దాత అమరబోయిన శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, యాదవ సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కోదాడ : కోదాడ పట్టణంలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మెదరమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో వేల మంది ఇళ్లు లేని నిరుపేదలున్నారని, వారందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పది, ఇరవై ఇళ్లు నిర్మాణం చేసి ప్రచారం చేసుకోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ముత్యాలు, భీమయ్య, శరబంధరెడ్డి, ఏసోబు, శ్రీనివాస్, సంగమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత

నడిగూడెం : మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10 తరగతి విద్యార్థులకు శుక్రవారం సర్వేజన ఫౌండేషన్ చైర్మన్ బండారు కవిత రూ.20 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు మోతీలాల్, ఉమాపతి, అశోక్‌గౌడ్, అక్షపతి, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వీఎన్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


కోదాడరూరల్ : ఎర్రవరంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత, సర్పంచ్

కోదాడరూరల్ : కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొరకుంట, ఎర్రవరంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముత్తవరపు ఆంధ్రజ్యోతి, వీరేపల్లి సుబ్బారావు, పీఏసీఎస్ చైర్మన్‌లు నలజాల శ్రీనివాసరావు, ముత్తవరపు రమేష్, డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కలకోవలో 'కంటి వెలుగు' ప్రారంభం

మునగాల : కంటి వెలుగు పథకం దేశానికి ఆదర్శమని ఎంపీపీ ఎలక బిందు అన్నారు. శుక్రవారం మండలంలోని రేపాల పీహెచ్‌సీ పరిధిలోని కలకోవ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె స్థానిక సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవానితో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీశ్రీదేవీభూదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక కల్యాణోత్సవాలను శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అంకురార్పణ దీక్షాధారణ, ధ్వజారోహణం, తీర్థప్రసాద వినియోగాలు గావించారు. అనంతరం ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఈనెల 5న రాత్రి ఎదుర్కోళ్ల మహోత్సవంతో శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

కోదాడరూరల్ : పశువులు, జీవాలకు వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు, పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బీక్యాతండా, రెడ్లకుంట, కూచిపుడితండాల్లో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆడ దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ బాణోతు అంబేద్కర్, సిబ్బంది వెంకటేశ్వరరావు, ఖాన్, అరుణరావు, సాయికృష్ణ, శ్రీను, శరత్, లక్ష్మమ్మ, ఆదినారాయణ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్.బి.అఖిల కోరారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగాపురంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 314 పశువులకు చికిత్స నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్.ఎం.రవికుమార్, మాజీ సర్పంచ్‌లు కొల్లు రామారావు, వీరబాబు, పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని జానకీనగర్‌లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ బాణోతు పంతులు, ఎంపీటీసీ బాణోతు కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా 62 పశువులకు ఉచిత వైద్యం అందించి మందులు అందజేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. పశువైద్యాధికారి వీరారెడ్డి, సిబ్బంది వీరబాబు, తరుణ్, గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, అశోక్, రైతులు ఉన్నారు.

సహాయ నిరాకరణ ఉద్యమం కొనసాగిస్తాం

గరిడేపల్లి : భాషా పండితులకు పదోన్నతులు వచ్చేంత వరకు సహాయ నిరాకరణ ఉద్యమం కొనసాగిస్తామని ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రామ్మూర్తి, ముత్తినేని కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానికంగా జరిగిన పండిత ఐక్య ఉద్యమ కార్యక్రమంలో భాగంగా 9, 10 తరగతుల భాషా బోధన బహిష్కరించి నిరసన తెలిపి మాట్లాడారు. భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి


హుజూర్‌నగర్‌లో విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు

హుజూర్‌నగర్ : తెలుగుదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ అని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో ప్రముఖ సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వనాథ్ మృతి కళా రంగానికి తీరని లోటని అన్నారు. ఆ సంఘం నాయకులు చెన్నా సోమయ్య, ధర్మూరి వెంకటేశ్వర్లు, ఎంఎస్‌ఎన్ రాజు, కేవీఎన్‌మూర్తి, ఎంబీ దేవదానం, వి.హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దిర్శించర్లలోని ప్రభుత్వ పాఠశాలలో..

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దర్శకుడు, పద్మశ్రీ కె.విశ్వనాథ్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, కోటిరెడ్డి, కృష్ణయ్య తదితరులున్నారు.

చర్చలు వాయిదా

హుజూర్‌నగర్ : పట్టణంలోని రైస్ మిల్లుల్లో పనిచేసే డ్రైవర్ల వేతనం, అలవెన్స్‌ల పెంపుపై స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం కార్మిక సంఘ నాయకులకు అసోసియేషన్ సభ్యుల మధ్య చర్చలు జరిగాయి. కాగా వేతనాల పెంపుపై సయోధ్య కుదరకపోవడంతో చర్చలు వాయిదా పడ్డాయి. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రోషపతి, ఉపేందర్, గురవయ్య, శ్రీను, మిల్లర్లు పి.లక్ష్మీనరసింహారావు, జి.ప్రభాకర్, కె.రామ్మోహన్‌రావు, కోటేశ్వరరావు, అప్పారావు, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.